క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్లు


కృష్ణప్రసాద్

సుజాతనగర్: సుజాతనగర్ తహసీల్దార్‌గా వనం కృష్ణప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆశ్వారావుపేట మండల తహసీల్దార్‌గా ప నిచేసిన ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ జి.శిరీష బూర్గంపాడుకు బదిలీ అయ్యారు.


శ్రీనివాస్

జూలూరుపాడు: భద్రాచలం తహసీల్దార్‌గా పనిచేసిన తూమాటి శ్రీనివాస్ జూలూరుపాడుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న స్వాతిబిందు కొత్తగూడెం కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.


ముత్తయ్య

టేకులపల్లి: టేకులపల్లి తహసీల్దార్ నాగభవానీ మహబూబాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న ముత్తయ్యకు తహసీల్దార్‌గా సోమవారం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇదిలా ఉండగా ముత్తయ్య పది రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు.

జీపీకి ప్రత్యేక అధికారిని నియమించాలి

టేకులపల్లి: టేకులపల్లి గ్రామ పంచాయతీకి ప్రత్యేక అధికారిని నియమించాలని 1వ వార్డు మాజీ సభ్యుడు, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి సోముల భానుచందర్ ఉన్నతాధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... ఫిబ్రవరిలో సర్పంచ్‌ల కాలపరిమితి అయిపోయాక అప్పటి నుంచి ప్రత్యేక అధికారులను నియమించారని, ఇందులో భాగంగానే టేకులపల్లి పంచాయతీకి ఎంపీడీఓ ప్రత్యేక అధికారిగా ఉన్నారని తెలిపారు. అయితే ఆయన వ్యక్తిగత సెలవుల్లో వెళ్లడంతో ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. పంచాయతీలో నిధులు లేక సొంత డబ్బులతో పని చేయిస్తే బిల్లులు కాక అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎక్కడ చూసినా వీధి లైట్లు, బ్లీచింగ్ లేక గ్రామస్తులు ఆగ్రహంతో ఉన్నారని, ఏ పని చేపించాలన్నా సర్పంచ్ స్థానంలో ఉన్న ప్రత్యేక అధికారికి తెలియజేయాల్సి ఉంటుందని, ఆయన అనుమతితోనే పనులు చేయాల్సిన ఈ నేపథ్యంలో ప్రత్యేక అధికారి లేకపోవడంతో కార్యదర్శిపై ఒత్తిడి పెరిగిందన్నారు.

15 మంది కానిస్టేబుళ్లు బదిలీ

సుజాతనగర్: సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న 15 మంది కానిస్టేబుళ్లు సోమవారం బదిలీ అయ్యారు. నిబంధనలు, సీనియారిటీ ఆధారంగా ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారికి స్థానచలనం కల్పించారు.

బదిలీ పోలీసులకు సన్మానం


పోలీసులను సన్మానిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: స్థానిక పోలీస్ స్టేషన్ విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ అజ్మీరా బుచ్చయ్య నాయక్ బోడు పోలీస్‌స్టేషన్, మహిళా కానిస్టేబుళ్ల శైలజ ఇల్లెందు, సౌజన్య పాల్వంచ టౌన్‌కు బదిలీ అయ్యారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ బాదావత్ రవి ఆధ్వర్యంలో వారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ


బొంబాయి తండాలో నాభిశిల ప్రతిష్ఠ పూజలు

ఇల్లెందురూరల్: బొంబాయితండా గ్రామంలో నాభిశిల ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు మేళతాళాలతో ప్రదర్శనగా బోనాలతో గ్రామదేవత వద్దకు తరలివచ్చి నైవేద్యం సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. పోచారం తండాలో మంగళవారం బొడ్రాయి ప్రతిష్ఠ జరగనుంది.

పాల్వంచరూరల్: పాతసూరారం గ్రామశివారు కొయ్యగుంపులో బొడ్రాయి, ముత్యాలమ్మ, పోతరాజుల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం మంగళవారం జరగనుంది. ఈ మేరకు సోమవారం విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాల్వంచ: పట్టణ పరిధిలోని శేఖరం బంజరలో బొడ్రాయి ప్రతిష్ఠ మూడో వార్షికోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం బోనాలు సమర్పణ, భక్తులకు అన్నదానం నిర్వహించనున్నారు.

కల్యాణ మండపం పూర్తయ్యేదెన్నడో?


అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపం

- కొత్తగూడెం భజన మందిరంలో 2010లో పనులు ప్రారంభం
- రూ.30లక్షలతో పనులు, ఆపై మరో రూ.40 లక్షలకు వినతి
- ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాని వైనం


శ్రీపాండురంగ భజన మందిరం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోనే కాక చుట్టుపక్కల ప్రాంతాల్లో పాండురంగ భజన మందిరం అంటే తెలియని వారు ఉండరు. అలాంటి మందిరం ఆవరణలో చేపట్టిన కల్యాణ మండపం ఏళ్లుగా పూర్తికాకపోవడంతో ఆలయం ఆదాయాన్ని కోల్పోతోంది. కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రి సమీపాన ఉన్న శ్రీ పాండురంగ భజన మందిరానికి జిల్లా నలుమూల నుంచి భక్తులు వస్తుంటారు. ఆలయ ఆవరణలో సాయిబాబా, కుసుమ హరినాథాలయం, ఆంజనేయస్వామి, శివపార్వతి, సుబ్రమణ్యస్వామి, కృష్ణుడు, పాండురంగడు, రాముడు, వెంకటేశ్వర స్వామి, లక్ష్మీనర్సింహాస్వామి, లక్ష్మీదేవి ఆలయాలు ఉన్నాయి. కాగా, ఆలయంలో పెళ్లిళ్లు జరుగుతున్నా ప్రత్యేక మండపం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండప నిర్మాణం పూర్తి చేస్తే ఆలయానికి అద్దె రూపంలో ఆదాయం సమకూరే అవకాశమున్నా పట్టించుకోవడం లేదు.

ఏళ్లుగా అసంపూర్తిగానే..

2010 ఏడాదిలో కల్యాణ మండపం ప్రారంభమైన పనులు ఇంకా పూర్తి కావాల్సి ఉంది. అప్పుడు రూ.30 లక్షలతో కల్యాణ మండపాన్ని నిర్మించాలని పనులు ప్రారంభించినప్పటికీ ప్రస్తుతానికి నిర్మాణం ముగింపు దశకు వచ్చి పనులు నిలిచిపోయాయి. దాదాపు 15 ఏళ్లు గడుస్తున్నా పరిస్థితులో మార్పు రాకపోవడం గమనార్హం. కాగా, మండపం నిర్మాణాన్ని పూర్తి చేయాలంటే మరో రూ.40 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు ఈఓ తెలిపారు.

శిథిలావస్థలో శివాలయం...

శ్రీపాండురంగ భజన మందిరంలో ఉన్న శివాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఆలయ పునఃనిర్మాణం చేయాలంటే దాదాపు రూ.20 లక్షల బడ్జెట్ అవసరమని, త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నామని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మిస్తే...

శ్రీపాండురంగ భజన మందిరంలోని కల్యాణ మండపం వినియోగంలోకి వస్తే భక్తులకు సౌకర్యంతో పాటు ఆలయానికి అద్దె రూపంలో ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అదేవిధంగా ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో కొంతమేర స్థలంలో షాపులను నిర్మిస్తే గుడికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు ఆయా షాపుల ఏర్పాటుతో కొనుగోలు చేస్తారు. అప్పుడు గుడికి మరింతగా ఆదాయం లభించే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ఆలోచన చేయాలని స్థానికంగా ఉండే భక్తులు ఆలయ అధికారులను కోరుతున్నారు.

ఏళ్లుగా నిర్మాణంలోనే ఉంది..



శ్రీపాండురంగ భజన మందిరం వద్ద నిర్మిస్తున్న కల్యాణ మండప నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి. 15 ఏళ్లుగా నిర్మాణంలోనే ఉంది. ఇది పూర్తయితే గుడికి ఆదాయం కూడా వస్తుంది. అధికారులు తక్షణమే స్పందించి త్వరగా పూర్తి చేయించాలి. – గణేష్, కొత్తగూడెం

షాపింగ్ కాంప్లెక్ నిర్మించాలి..



శ్రీపాండురంగ భజన మందిరం ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి కిరాయిలకు ఇస్తే ఆలయాలనికి ఆదాయం కూడా వస్తుంది. అధికారులు ఆ దిశగా ఆలోచించి చర్యలు తీసుకుంటే భక్తులు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. – రుక్మాంగధర్ బండారి, కొత్తగూడెం

నివేదిక అందజేశాం..



ఆలయ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాం. కల్యాణ మండపం కోసం గతంలో రూ.30 లక్షలు కేటాయించగా కొంత మేర పనులు పూర్తయ్యాయి. మరో రూ.40 లక్షలతో అన్ని పూర్తవుతాయి. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. – కె.సులోచన, ఆలయ ఈఓ

రక్తదానం మరొకరికి ప్రాణబిక్ష


ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: రక్తదానం చేయడం వలన మరొకరి ప్రాణాలు కాపాడిన వారు అవుతారని వక్తలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం బస్టాండ్ ఎదురుగా శ్రీ శారద విద్యాలయంలో యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు, క్లబ్ నేషనల్ ఫౌండర్, ప్రెసిడెంట్ జేబీ బాలు, కమిటి సభ్యుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ... రక్తదానం చేసి, సేకరించిన రక్తాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ప్రధానాస్పత్రికి ఇవ్వడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలకు ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీనివాస్‌రెడ్డి, బి.జోషి, వెంకటరమణ, వెంకటపుల్లయ్య, లగడపాటి రమేష్, గుండెబోయిన సతీష్, ఎం.బాలునాయక్, కమలాకర్, జుబ్బు, రాజేష్, రాజు, శారద తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌బజార్ ఎండీగా మురళీధర్


మురళీధర్‌ను అభినందిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సూపర్ బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఏజీఎం, ఏజీఎం మురళీధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈఈ సెల్ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న మురళీధర్‌కు సూపర్ బజార్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కంపెనీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బంది, సీఎంఓ ఏఐ ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి టీచర్లకు శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న ప్రభుదయాళ్

కొత్తగూడెంఅర్బన్: మండల స్థాయి ప్రాథమిక ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను సమర్థవంతంగా నిర్వహించాలని కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాళ్ కోరారు. సోమవారం మండల రిసోర్స్ పర్సన్లతో ముందస్తు సమావేశం నిర్వహించి శిక్షణ కార్యక్రమాలపై వివరించారు. తోటి ఉపాధ్యాయులు అసౌకర్యానికి గురికాకుండా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఉమ్మడిగా చర్చిస్తూ నూతన బోధనా కృత్యాలను ఆవిష్కరిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో తరగతులు ఆహ్లాదకరంగా నిర్వహించబడేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. లక్ష్మీదేవిపల్లి ఎంఈఓ కృష్ణయ్య, రిసోర్సు పర్సన్లు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జూలూరుపాడు: 20వ తేదీ నుంచి 24 వరకు స్థానిక కేజీబీవీలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ తరగతులు జరగనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బానోత్ జుంకీలాల్ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, ఎఫ్ఎల్ హెచ్ఎంలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి


సుందరయ్య స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: సమాజంలో పేద, ధనిక తేడా ఉండరాదని, మనుషులంతా ఒక్కటేనన్న భావనతో సమాజం ముందుకు సాగాలని ఆశించిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా నాయకులు ఎస్ఏ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ అన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం ఇల్లెందులోని కొత్త బస్టాండ్ సెంటర్‌లోని సుందరయ్య స్మారక స్తూపం వద్ద పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించి, నివాళులర్పించారు. మాట్లాడుతూ.. సీపీఎం కార్యకర్తలు, నాయకులు సుందరయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాలకులు ప్రజాసమస్యలను విస్మరించారని, ప్రజలకు ఎర్రజెండాయే ప్రత్యామ్నాయంగా మిగిలిందన్నారు. సామాన్యులకు అందుబాటులో లేకుండా నిత్యావసర సరకుల రేట్లు పెంచి పేదల జీవితాలను బుగ్గిపాలు చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలుఅమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, వజ్జా సురేష్, మోహన్‌రావు,సుల్తానా, సంధ్య, మాదారపు వెంకటేశ్వర్లు, ఖాదర్, బోస్, మహబూబ్, పద్మ, జైబున్నిసా, నాగరాజు , అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతకు మరమ్మతులు

టేకులపల్లి: ఇంకుడుగుంతల నిర్మాణాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. వర్షాకాలంలో వరద రోడ్డుపై నిలిచి రోడ్లు దెబ్బతినడం, రాకపోకలకు ఇబ్బందిగా మారకుండా, రహదారుల వెంబడి కూడా ఇంకుడుగుంతలు తవ్వారు. ఈ క్రమంలో టేకులపల్లి సెంటర్‌లో ఇంకుడుగుంతను ఎత్తులో ఏర్పాటు చేశారు. దీనిపై 'ఇంకుడు గుంత నిర్మాణం ఇలానా'... అనే శీర్షికన సోమవారం సాక్షి పత్రికలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి ఉన్నతాధికారులు స్పందించారు. కార్యదర్శి ఉప్పు దీప్తి రోడ్డుపై నిల్వ ఉండే నీటిని ఇంకుడుగుంతలోకి వెళ్లే సరిచేయించారు.

సాక్షి ఎఫెక్ట్..

తాగునీటి సమస్యకు పరిష్కారం

జూలూరుపాడు: కొత్తూరు గ్రామ పంచాయతీ చిన్న హరిజనవాడలో అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈనెల 15న సాక్షి దినపత్రికలో 'తాగునీటికి కటకట'అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రక్షిత మంచినీటి పథకం బోరు బావికి కొత్త విద్యుత్ మోటార్‌ను సోమవారం అమర్చి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. రెండేళ్లుగా మూలనపడిన రక్షిత మంచినీటి పథకాన్ని అధికారులు వినియోగంలోకి తేవడంతో చిన్న హరిజనవాడ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫారంపాండ్ నిర్మాణాలు పూర్తిచేయండి..


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి

పాల్వంచరూరల్: నీటి కుంటల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.విజయ భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. తోగ్గూడెం గ్రామంలో సోమవారం ఉపాధి హామీ పథకం కింద కూలీలు నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. అనంతరం ఫారంపాండ్ నిర్మాణానికి మార్క్‌ను నిర్దేశించారు. అనంతరం ఉపాధి కూలీలు, పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. గ్రామపంచాయతీకి ఐదు ఫారంపాండ్‌ల చొప్పున నిర్మించాలన్నారు. వర్షాలు పడకముందే వాటి పనులు పూర్తి చేయాలన్నారు. 20 మీటర్ల పొడువు, 20 మీటర్ల వెడల్పుతో నీటికుంటల నిర్మాణం చేయడం వలన అందులో నీటి నిల్వ ఉండి నీటిఎద్దడి వచ్చినప్పుడు కుంటలోని నీరు పంటలకు కూడా ఉపయోగపడుతుందన్నారు. చేపల పెంపకానికి కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ రంగా, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

టీచర్ ఆరోపణలు అవాస్తవం

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ టీచర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని టేకులపల్లి-2 సెంటర్ అంగన్‌వాడీ టీచర్ చేసిన ఆరోపణలు అవాస్తవమని సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈ మేరకు ఈనెల 16న అంగన్‌వాడీ టీచర్ కుంజా భద్రమ్మ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో సోమవారం ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లంతా సీడీపీఓతో కలిసి జిల్లా సంక్షేమ అధికారికి రాతపూర్వకంగా వివరణ అందజేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన అంగన్‌వాడీ టీచర్ సెంటర్‌లో విధులు సక్రమంగా నిర్వహించదని, ఆయాతో గొడవల కారణంగా ఆయా ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో టీచర్‌కు మెమో ఇవ్వడం జరిగిందని ఇవన్నీ మనసులో పెట్టుకుని తప్పుడు ఆరోపణలు చేస్తోందన్నారు. ఇదిలా ఉండగా జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనీనా టేకులపల్లి-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్, సీడీపీఓలతో మాట్లాడారు. ప్రాథమికంగా వివరాలు సేకరించారు. ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్ల నుంచి డబ్బులు వసూలు చేసిన సీడీపీఓ, సూపర్‌వైజర్లపై తగిన చర్యలు తీసుకోవాలని, తమ వద్ద ఆధారాలు ఉన్నాయని డీడబ్ల్యూఓకు తెలిపామని అంగన్‌వాడీ టీచర్ కుంజా భద్రమ్మ తెలిపారు.

కలిసికట్టుగా పోరాడుదాం..


గంగారంలో సమావేశమైన గిరిజన రైతులు, నాయకులు

టేకులపల్లి: ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న గిరిజనుల భూములను ఎవరైనా కబ్జా చేస్తే ఊరుకునేది లేదని, గిరిజనులకు అండగా ఉంటామని గిరిజన నాయకులు, పెద్దలు తెలిపారు. ఈ మేరకు సోమవారం గంగారం గ్రామంలోని మామిడి తోటలో కిష్టారం, లచ్చగూడెం, గంగారం, సంపత్ నగర్, వజ్జోనిగూడెం, చర్లపెల్లి, రోడ్డుగుంపు, టేకులగుంపు, ఉలవచలక గ్రామాలకు చెందిన గిరిజన రైతులు, నాయకులు సమావేశమయ్యారు. గంగారమ్ మాజీ సర్పంచ్ పాయం సమ్మయ్య మాట్లాడుతూ... భూభారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని, ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేలకు దరఖాస్తు సమర్పించాలని కోరారు. సంపత్ నగర్ గ్రామానికి చెందిన అబ్బినేని సాంబశివరావు భూవివాదంపై జరుగుతున్న ప్రచారాలను ఖండించారు. అసలు సాంబశివరావుకు ఆ సర్వే నంబర్లలో భూమి లేదని ఆ సర్వే నంబర్లు మిట్టపల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతులవన్నారు. వజ్జోనిగూడెం గ్రామ సమీపంలో రిటైర్డ్ సీఐ నర్సయ్య భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారని ఆ భూమికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోగా రామనాథం, కొరస మల్లయ్య, కొమరం చిట్టిబాబు, మెట్ల వెంకటేశ్వర్లు, కల్తీ కృష్ణయ్య, మూతి కృష్ణయ్య, బొల్లి కృష్ణ, మూతి లింగారావు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి..


మాట్లాడుతున్న సాబీర్ పాషా

పాల్వంచ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సాబీర్‌పాషా మాట్లాడుతూ... మండలంలోని ప్రతీ పంచాయతీలో సీపీఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా సిద్ధం కావాలన్నారు. డిసెంబర్ 26 నాటికి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గ్రామగ్రామన ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ముత్యాల విశ్వనాథం, నిమ్మల రాంబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబు, గుండాల నాగరాజు, ఉప్పుశెట్టి రాహుల్, ఇట్టి వెంకట్రావ్, కొంగర అప్పారావు, వేములపల్లి శ్రీనివాసరావు, ఆవుల సతీష్, అజిత్, బానోతు రంజిత్, ఉంద్రాతి రవి, మన్యం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే.. జాగారమే

- అలుగు వాగు, బుగ్గవాగులతో పొంచి ఉన్న ప్రమాదం
- ముంచుకొచ్చిన వానాకాలం..
- ఇల్లెందు పట్టణంలో ఐదు చోట్ల బ్రిడ్జిలు అవసరం



సత్యనారాయణపురం అలుగు వాగు కాజ్‌వే (ఇన్‌సెట్) బందెల మల్లయ్య కుంట వాగు కాజ్‌వే

ఇల్లెందు: వాన వస్తే వాగులు వస్తాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు రావటం వాగు చూడటం.. హడావుడి చేయడం.. తాత్కాలికంగా స్థానికులను సమీప పాఠశాలలోకి తరలించటం ఆహారం పొట్లాలు అందించటం సర్వసాధారణమైంది. కానీ ఇల్లెందు పట్టణానికి వాగుల మీద శాశ్వత పరిష్కారానికి వాగుల మీద బ్రిడ్జిలు మాత్రం నిర్మించడం లేదు. పట్టణం గుండా ప్రవహించే బుగ్గవాగు చిన్నచిన్న వర్షాలకు కూడా పొంగుతుంది. మంచినీటి చెరువు నిండితే వాగు ఉప్పొంగుతుంది. ఇల్లెందులో బుగ్గవాగు సమస్య తీవ్రంగా ఉంటుంది. పలుచోట్ల లోలెవల్ కాజ్‌వేలు ఉన్నాయి. వాగు పొంగితే కాజ్‌వేలపై నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. చెత్తచెదారం కాజ్‌వే ఖానాలకు అడ్డుగా పెట్టి వరద పోటు ఉంటుంది. లోతట్టు పరిసర ప్రాంతాలు జలమయంగా మారుతుంటాయి. ఇక బుగ్గవాగు, అలుగు వాగుల వల్ల అటు సత్యనారాయణపురం, ఇల్లెందులపాడు వాసులకు వరదపోటు తప్పటం లేదు.

అడ్డంకిగా అలుగు వాగు..

సత్యనారాయణపురానికి అలుగు వాగు ఆటంకంగా ఉంది. వాగు ఉధృతంగా ప్రవహిస్తే గ్రామంలోకి వెళ్లటం కష్టమే. వార్డులకు పట్టణంతో రాకపోకలు నిలిచిపోతాయి. ఇక ఇదే సత్యనారాయణపురానికి మరోమార్గం బర్లపెంట మీదుగా వెళ్లే రహదారికి బుగ్గవాగు ఆటంకంగా ఉంది. బర్లపెంట వద్ద లోలెవల్ కాజ్‌వే ఉంది. ఇది ఏటా వాగు పొంగినప్పుడు పైనుంచి ప్రవహిస్తుంది. చెత్తచెదారం వరదకు అడ్డుగా పడి పోటు ఎత్తుతుంది. దీంతో బర్లపెంట జలమయంగా మారుతుంది. ఇలా సత్యనారాయణపురానికి ఏటా అటు అలుగు వాగు ఇటు బుగ్గవాగు వల్ల ప్రమాదం పొంచి ఉంది. ఇదిలా ఉండగా ఇల్లెందులపాడు ప్రజలు శ్మశానవాటికకు వెళ్లాలంటే అలుగు వాగు దాటాలి. ఇటీవల ఈ అలుగు వాగు మీద చప్టా పూర్తిగా కొట్టుకుపోయింది.

ఎస్‌జీఓ కాలనీ వైపుకు వెళ్లాలంటే..


పట్టణంలోని నెంబర్-2 బస్తీ నుంచి ఎస్‌జీఓ కాలనీ మీదుగా బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో బుగ్గవాగు మీద లోలెవల్ కాజ్‌వే నిర్మించారు. ఈ లోలెవల్ కాజ్‌వే మీదుగా వాగు పొంగితే ప్రమాదం తప్పటం లేదు. రాకపోకలు నిలిచిపోతుంటాయి. అంతేగాక లోలెవల్ కాజ్‌వే ఖానాలకు అడ్డుగా చెత్త పడి వరద పోటు వేసి ఎస్‌జీఓ కాలనీ, ఎరుకల బజార్, బందెల మల్లయ్య కుంట, నంబర్-2 బస్తీలో కొన్ని ప్రాంతాలలో నీరు చేరుతుంది.

తీరని హైలెవల్ వంతెనల కల ..

పట్టణం నడిబొడ్డు నుంచి ప్రవహిస్తున్న బుగ్గవాగు వల్ల ప్రజలు ఏటా వర్షాకాలంలో ఇబ్బందుల నుంచి ఉపశమనం కలగాలంటే మూడు చోట్ల వాగుల మీద హైలెవల్ వంతెనలు నిర్మించాలి. సత్యనారాయణపురం గ్రామం వద్ద అలుగు వాగు మీద ఒక హైలెవల్ వంతెన, సత్యనారాయణపురం, బర్లపెంట మధ్య బుగ్గవాగు మీద హైలెవల్ వంతెన, నంబర్ - 2 బస్తీ - ఎస్‌జీఓ కాలనీ మధ్య హైలెవల్ వంతెన, ఎస్‌జీఓ కాలనీలో ఒక హైలెవల్ వంతెన, బందెల మల్లయ్య కుంట - సత్యనారాయణపురం మధ్య హైలెవల్ వంతెన నిర్మించాల్సి ఉంటుంది. ఇల్లెందులపాడు నుంచి శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో అలుగు వాగు మీద కూడా హైలెవల్ వంతెన నిర్మించాల్సి ఉంది.


ఈ సమస్యలపై ఇల్లెందు ప్రజలు ప్రజాప్రతినిధులకు, అధికారులను పలుమార్లు మొర పెట్టుకున్నా వినపడనట్లే ఉంటున్నారు.

హైలెవల్ వంతెనలు అవసరం...



ఇల్లెందు మధ్య నుంచి ప్రవహించే బుగ్గవాగు, అలుగు వాగుల మీద హైలెవల్ వంతెనలు నిర్మించాలి. ఏటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. వాగులు పొంగితే సత్యనారాయణపురం వెళ్లటం కష్టంగా ఉంటుంది. – పీకే శ్రీను, సత్యనారాయణపురం

స్థానికులు ఇబ్బంది పడుతున్నారు..



పట్టణంలో హైలెవల్ వంతెనలు లేపకోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలుగు వాగు, సత్యనారాయణపురం, బందెల మల్లయ్య కుంట వాగు, ఎస్‌జీఓ కాలనీ వాగుల మీద వంతెనలు నిర్మించాలి. అధికారులు స్పందించాలి. – నబీ, సీపీఎం నాయకుడు